# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 26-12-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:117 పేజీలు:6 వెల: రూ.1/-


**చురక**

అభివృద్ధి వికాసం
అధికారపు స్లోగన్
పట్టాలకెక్కకుండా
పరుగెత్తని వ్యాగన్.

ఎందుకింకా అచ్ఛేదిన్
ఏడుపుగొట్టు మాటలు
మరోసారి పవర్ కొరకు
మాయా భ్రమల ఆటలు

-వేల్పుల నారాయణ
9440433475

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జ్వరం

### -గత మూడు రోజుల నుంచి జ్వరం, గొంతు నొప్పితో బాధపడుతున్న సిఎం

హైదరాబాద్ డిసెంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జ్వరం బారిన పడ్డారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసంలో ఆయనకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి జ్వరం, గొంతు నొప్పితో రేవంత్ బాధపడుతున్నట్లు సమాచారం. ఇంటి వద్దే ఫ్యామిలీ డాక్టర్ రేవంత్‌ను పరీక్షించి, మందులు సూచించినట్లు తెలుస్తోంది.నిన్న సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలోనూ రేవంత్ కొంత నీరసంగా కనిపించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరమే రేవంత్ స్వల్ప అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది.

## ఫీవర్ హాస్పటల్లో కోవిడ్ ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 25:కరోనా కొత్త వేరియంట్ కారణంగా దేశంలో పాజిటివ్ కేసుల సంఖ్యల పెరుగుతోంది. దాదాపు 700లకుపైగా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కరోనాతో మరణాలు కూడా నమోదు అవుతున్నాయి. ఇక, తెలంగాణలో కూడా కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. పదుల సంఖ్యలో పాజిటివ్ కేసులు ఉన్నట్టు వైద్యారోగ్యశాఖ బులిటెన్‌లో పేర్కొంది.

ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సోమవారం తిలక్‌నగర్‌లోని ఫీవర్ ఆసుపత్రికి వెళ్లారు. కోవిడ్‌పై ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'కోవిడ్ వ్యాప్తిపై రాష్ట్రాలను అప్రమత్తం చేశాం. అవసరమైతే కోవిడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తాం. కొత్త వేరియంట్ వ్యాప్తి వేగంగా ఉంటుందని, ప్రమాదకరంకాదని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నారు. కోవిడ్ కట్టడికి ప్రజలు కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. ఆసుపత్రుల్లో ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని అన్నారు.

## జనవరి ఒకటో తేదిన సెలవు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం ..

హైదరాబాద్, డిసెంబర్ 25: కొత్త సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబర్ 31 రాత్రి 1 గంట వరకు వేడుకలు జరుపుకోవడానికి పబ్ లు, బార్లు, ప్రైవేట్ ఈవెంట్స్ అనుమతించనున్నట్లు తెలిపింది. పబ్ లు, క్లబ్ లు, బార్, రెస్టారెంట్లు, హోటళ్లు ఒంటి గంట వరకు తెరచుకునేందుకు అనుమతించనుంది. అయితే, ముందస్తు అనుమతి తప్పనిసరి అని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే జనవరి 1 న ప్రభుత్వం సెలవు ప్రకటించింది. జనవరి 1 ని జనరల్ హాలిడేగా డిక్లేర్ చేసింది. ప్రత్యామ్నాయంగా ఫిబ్రవరి రెండవ శనివారం సెలవును రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది.

## దేశంలో4 వేల మార్క్‌ను దాటిన కొవిడ్ యాక్టివ్ కేసుల సంఖ్య

న్యూ డిల్లీ డిసెంబర్ 25 (ఎక్స్ ప్రెస్ సన్స్ );భారత్‌లో కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 4 వేల మార్క్‌ను దాటింది. కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు 24 గంటల వ్యవధిలో 312 కొత్త కేసులు బయటపడ్డాయి. దీంతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 3,742 నుంచి 4,054కు పెరిగింది. ఇక తాజా కేసుల్లో అత్యధికంగా కేరళలో 128 కేసులు వెలుగుచూశాయి. నిన్న ఒక్క రోజే ఒక మరణం నమోదైంది. దీంతో మొత్తం కొవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 5,33,33కి చేరింది. ఇక 24 గంటల్లో 315 మంది కొవిడ్ నుంచి కోలుకున్నారు. దీంతో మొత్తం కోలుకున్న వారి సంఖ్య 4.44 కోట్లకు (4,44,71,860) చేరుకుంది. మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసుల సంఖ్య 0.01 శాతం మాత్రమేనని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. అదేవిధంగా రికవరీ రేటు 98.81 శాతం, మరణాలు 1.18 శాతంగా ఉన్నాయని తెలిపింది. ఇప్పటి వరకూ 220.67 కోట్ల (220,67,79,081) కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు వెల్లడించింది. ఇదిలా ఉండగా, మహారాష్ట్రలోని థానేలో తాజాగా 5 కరోనా కొత్త వేరియంట్ జేఎన్.1 కేసులు నమోదయ్యాయి. నవంబర్ 30 నుంచి 20 నమూనాలను పరీక్షించగా థానే నగరంలో ఐదు ఏజె.1 వేరియంట్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం నగరంలో క్రియాశీల కేసుల సంఖ్య 28కి పెరిగింది. వారిలో ఇద్దరు ఆసుపత్రులలో చికిత్స పొందుతుండగా, మిగిలిన వారు వారి ఇళ్లలో కోలుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం దేశంలో కరోనా కేసులు మళ్లీ పెరగడానికి కొత్త వేరియంట్ జేఎన్.1 (ఏజె.1) కారణమని తెలుస్తోంది.

## ప్రసాదం తినడంతో భక్తులకు అస్వస్థత..

### ఒకరు మృతి, 70 మందికి సీరియస్

బెంగళూరు, డిసెంబర్ 25 కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో విషాదం నెలకొంది. హోస్కోటేలోని ఓ ఆలయం వద్ద పంచిపెట్టిన ప్రసాదం తిని ఓ మహిళ మృతి చెందగా, మరో 70 మందికి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరందరికి వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వివరాల్లోకి వెళ్తే.. హోస్కోటేలోని ఓ ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అయితే రోజు మాదిరిగానే అక్కడ శనివారం కూడా ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఇక భక్తులు ప్రసాదం సేవించి, తమ తమ నివాసాలకు చేరుకున్నారు. ఆదివారం నాడు 70 మంది దాకా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ ఓ మహిళ సోమవారం ఉదయం మృతి చెందింది. పలువురు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. అయితే ప్రసాదం సేవించని ఇతర భక్తులకు ఎలాంటి వాంతులు, విరేచనాలు కాలేదని అధికారుల విచారణలో తేలింది.

## లోక్ సభ బరిలో రంజిత్ రెడ్డి..

### భారీ మెజార్టీతో గెలిపించాలని కెటీఆర్ పిలుపు

హైదరాబాద్, డిసెంబర్ 25:లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం కావాలని, అసెంబ్లీల వారీగా భేటీలు ఏర్పాటు చేసుకోవాలని పార్టీ నేతలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశించారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ నేతలతో సోమవారం కేటీఆర్ సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఏమాత్రం కుంగిపోవద్దని.. ఓడిపోయిన బీఆర్ఎస్ అభ్యర్థులే నియోజకవర్గ ఇంచార్జులని? తమ తమ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని పార్టీ కేడర్‌కు సూచించారు. జనవరి 26వ తేదీ లోగా సమావేశాలు పూర్తి చేసుకోవాలని కేటీఆర్ సూచించారు.

సమీక్ష అనంతరం చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. తనను చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయమని కేటీఆర్ చెప్పారు. గెలుపే లక్ష్యంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిన స్థానాలపై ప్రత్యేక దృష్టి పెడుతాం అని రంజిత్ రెడ్డి పేర్కొన్నారు.

## మధ్యప్రదేశ్ క్యాబినెట్ విస్తరణ..

### మంత్రులుగా 28 మంది ప్రమాణం..



భోపాల్, డిసెంబర్ 25 మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తన క్యాబినెట్‌ను విస్తరించారు. కొత్తగా 28 మందిని తన క్యాబినెట్‌లో చేర్చుకున్నారు. వారి 18 మంది క్యాబినెట్ మంత్రులుగా, ఆరుగురు స్వతంత్రులుగా, మిగతా నలుగురు సహాయ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మధ్యప్రదేశ్ క్యాబినెట్‌లో ముఖ్యమంత్రితో కలిపి మొత్తం 35 మందికి చోటు కల్పించే అవకాశం ఉంది.

సీఎం మోహన్ యాదవ్ కొత్తగా క్యాబినెట్‌లోకి తీసుకున్న 28 మందితో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ సీ పటేల్ ప్రమాణస్వీకారం చేయించారు. క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణం చేసిన 18 మందిలో ప్రద్యుమన్ సింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్, కైలాస్ విజయవర్గీయ, విశ్వాస్ సారంగ్ ఉన్నారు. ఆరుగురు స్వతంత్ర హోదా మంత్రులుగా అవకాశం కల్పించారు. మరో నలుగురిని సహాయ మంత్రులుగా తీసుకున్నారు.

కాగా ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. అయితే ఈసారి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కాకుండా మరో నేత మోహన్ యాదవ్‌కు బీజేపీ అధిష్ఠానం సీఎం పదవి కట్టబెట్టింది. రాజస్థాన్ బీజేపీ నేతలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు.

## వన దేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క



ములుగు , డిసెంబర్ 25: మేడారంసమ్మక్క సారలమ్మ వన దేవతలను పంచాయితీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ దనసరి అనసూయ సీతక్క సోమవారం దర్శించుకున్నారు. ముందుగా పసరలోని గుండ్ల వాగు బ్రిడ్జిని, దయ్యాలవాగు సమీపంలో ఉన్న రోడ్డును చింతల్ క్రాస్ వద్ద రోడ్డు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అదే విధంగా చిలుకల గుట్ట, వీఐపీ పార్కింగ్ బస్ స్టాండ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చెయ్యాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి జాతర పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎస్పీ గౌస్ ఆలం, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎస్పీ రవీందర్ పాల్గొన్నారు.

## నల్గొండ రోడ్డు ప్రమాదాలపై కెసిఆర్ దిగ్బ్రాంతి

### - ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్..

నల్గొండ , డిసెంబర్ 25:నల్లగొండ జిల్లాలో జరిగిన వేరు వేరు రోడ్డు ప్రమాదాల దుర్ఘటనలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు మరణించారు. కాగా..ఈ రోడ్డు ప్రమాదాలపై కేసీఆర్ తీవ్రగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడటంపై తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని, మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కేసీఆర్ కోరారు.

## యూపీలో ఘోర ప్రమాదం.. పొగమంచు కారణంగా ఢీకొన్న 10 వాహనాలు



న్యూఢిల్లీ, డిసెంబర్ 25: ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. దేశరాజధాని ఢిల్లీకి సుమారు 86 కిలోమీటర్ల దూరంలో ఉన్న హాపూర్‌లోని హఫీజ్‌పూర్ కొత్వాలి ప్రాంతంలో పలు వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాపూర్-బులంద్‌షహర్ హైవేపై సోమవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. పొగ మంచు కారణంగా సుమారు 10 వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో పలు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ప్రమాదం నేపథ్యంలో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో దెబ్బతిన్న కార్లను క్రేన్ సాయంతో పోలీసులు అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు.

దేశ రాజధాని ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. రాజధాని ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 9.4 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. దీంతో రాజధాని ప్రాంతాన్ని దట్టంగా పొగ కమ్మేసింది దట్టమైన పొగ మంచు కారణంగా విజిబిలిటీ సరిగా లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారత వాతావరణ విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. రాజధాని సహా చుట్టు పక్కల ప్రాంతాల్లో విజిబిలిటీ జీరోకి పడిపోయింది.

## నూతన సంవత్సర ఈవెంట్లకు అనుమతి తప్పనిసరి:

### సీపీ అవినాశ్ మహంతి

హైదరాబాద్, డిసెంబర్ 25: నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించే ఈవెంట్లకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సిందేనని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి అన్నారు. పర్మిషన్ తీసుకున్న తర్వాతే టికెట్లు విక్రయించాలని స్పష్టం చేశారు. మాదాపూర్‌లోని హైటెక్‌సిటీ సమీపంలో నిర్వహించ తలపెట్టిన 'సన్‌బర్న్' ఈవెంట్‌పై తలెత్తిన వివాదంపై సీపీ స్పందించారు. ఈవెంట్ నిర్వాహకులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ తాము అనుమతి ఇవ్వలేదని చెప్పారు. ఇది ఇతర నగరాల్లో జరిగే సన్‌బర్న్‌లాంటి వేడుక కాదని, అందుకే పర్మిషన్ నిరాకరించామని తెలిపారు.

కాగా, ఈవెంట్‌కు అనుమతి ఇవ్వకపోయినప్పటికీ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయిస్తున్నారు. దీనిపై బుక్‌మై షో ప్రతినిధులకు వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తున్నది. పరిధి దాటితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం.

## ఛత్తీస్‌గఢ్ దంతెవాడలో ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నక్సలైట్‌లు మృతి

దంతెవాడ డిసెంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మన్యంలో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నక్సలైట్‌లు మృతి చెందారు. దంతెవాడ జిల్లాలో నక్సలైట్ల కదలికలు ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు, ఆర్మీ జవాన్‌లు కలిసి సంయుక్తంగా కూంబింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా భద్రతా సిబ్బందికి నక్సలైట్‌లు ఎదురుపడటంతో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. దంతెవాడ-సుక్మా జిల్లాల సరిహద్దులోని తుమక్‌పాల్-దబ్బా కున్నా గ్రామాల మధ్య ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాటే కళ్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల దబ్బాకున్నా గ్రామ శివార్లలోని కొండపై ఉన్న నక్సలైట్లను ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు భద్రతా సిబ్బంది చుట్టుముట్టడంతో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుందని, బస్తర్ రేంజ్ ఐజీపీ సుందర్‌రాజ్ చెప్పారు. ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామాగ్రి లభ్యమైనట్లు తెలిపారు

## కాలీఫ్లవర్ తెంపిందని.. తల్లిని స్తంభానికి కట్టేసి, కొట్టిన కుమారుడు

భువనేశ్వర్, డిసెంబర్ 25 ఓ యువకుడు తన తల్లి పట్ల క్రూరంగా ప్రవర్తించాడు. తన పొలంలో నుంచి కాలీఫ్లవర్ తెంపిందని తల్లిని కుమారుడు స్తంభానికి కట్టేసి, తీవ్రంగా చితకబాదాడు. ఈ దారుణ ఘటన ఒడిశాలోని కియోంఝార్ జిల్లాలో వెలుగు చూసింది.

వివరాల్లోకి వెళ్తే.. కియోంఝార్ జిల్లాలోని సరసపాసి గ్రామానికి చెందిన ఓ 70 ఏండ్ల వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది.

ఆమె కుమారులు వేర్వేరుగా ఉంటున్నారు. అయితే చిన్న కుమారుడి పొలంలోకి వెళ్లిన తల్లి.. అక్కడున్న కాలీఫ్లవర్‌ను తెంపి ఇంటికి తీసుకొచ్చింది. తన అనుమతి లేకుండా కాలీఫ్లవర్ ఎందుకు తెంపావని తల్లిని కుమారుడు నిలదీశాడు. అంతటితో ఆగకుండా ఆ వృద్ధురాలిని స్తంభానికి కట్టేసి తీవ్రంగా చితకబాదాడు.

వృద్ధురాలిని కాపాడబోయిన స్థానికులను కూడా బెదిరించాడు. అయినప్పటికీ స్థానికులు ఆమెను ప్రాణాలతో రక్షించారు. అనంతరం బాధితురాలిని బసుదేవ్‌పూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుడిపై కేసు నమోదు చేశారు.

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**జోరావరుయు,ఫతేయును**
**వీరోచితమైనరీతి పెరవారలపై**
**పోరుచు,నొరిగిన దినమే**
**భారతమున జెలగె "వీర బాల దినము"గాన్ ?**

(26-12-1705 గురుగోవింద్ సింగ్ పసికూనలు జోరావర్ సింగ్,ఫతే సింగ్ తురకలతో యుద్ధంలో చనిపోయిన రోజు.దీనినే "వీరబాలదివస్"గా జరుపుతారు)



-రాధశ్రీ
సెల్:9494481210

## వికారాబాద్ జిల్లాలో చెరువులోకి దూసుకెళ్లిన కారు

వికారాబాద్ : కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటన జిల్లాలోని శివారెడ్డి పేటలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరికి వచ్చిన పర్యాటకులు తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌కు వెళ్తుండగా సోమవారం ఉదయం మంచు కురుస్తున్న కారణంగా ముందు ఉన్న రోడ్డు సరిగా కనిపించక కారు అదుపు తప్పి శివరెడ్డిపేట చెరువులోకి దూసుకెళ్లినట్టు సమాచారం. చెరువులోకి దూసుకెళ్లిన కారులో ఉన్న ముగ్గురు సురక్షితంగా బయటపడగా మరో ఇద్దరి కోసం పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది




# జెఎల్.1 సబ్‌వేరియంట్ వైరస్ కేసుల కలకలం !

ప్రపంచవ్యాప్తంగా క్రిస్‌మస్ వేడుకలు ఆరంభం కావడం, నూతన సంవత్సర వేడుకల్లో కేకలు వేయడానికి ప్రజలు సిద్ధపడుతున్న వేళ కరోనా సబ్‌వేరియంట్ జెఎన్ . 1 వ్యాప్తి వార్తలు ప్రజలను భయకంపితులను చేస్తున్నాయి. “కోవిడ్ వస్తోంది ! కోవిడ్ పోతోంది ! మళ్లీ తిరిగి వస్తోంది !” అనే నినాదం నిజమనిపిస్తోంది. సార్స్ కోవ్ – 2 వేరియంట్స్ మేఘాలు కమ్మి జనాన్ని భయపెట్టడం, తిరిగి తొలగి పోవడం జరుగుతున్నాయి. కరోనా వైరస్ భూగోళం నుంచి పూర్తిగా తొలగి పోవడం అసాధ్యంగానే తోస్తోంది. నవంబర్ 2021లో బయట పడిన ఒమిక్రాన్ వైరస్ కాలక్రమంలో మరెన్నో సబ్‌వేరియంట్లకు కారణం కావడం చూస్తున్నాం. కరోనా కొత్త వేరియంట్స్, సబ్‌వేరియంట్స్ పుట్టుకు రావడంతో ప్రపంచ మానవాళి గజగజ వణకవలసి వస్తున్నది.

### జెఎల్.1 సబ్‌వేరియంట్ విజృంభన:

ప్రస్తుతం ఒమిక్రాన్ సబ్‌వేరియంట్ అయిన జెఎన్ . 1 ఉనికి బయట పడడంతో మరో సారి కరోనా క్రమశిక్షణలు పాటించవలసిన అగత్యం ఏర్పడుతున్నది. బిఎ. 2. 86కు సంబంధించిన సబ్‌వేరియంట్ జెఎన్. 1 వైరస్ ఆగష్టు 2023 మాసంలో లాగ్జెంబర్గ్‌లో బయట పడి యూకె, ఐస్‌లాండ్, యూఎస్, ఫ్రాన్స్ దేశాల వ్యాపించడం, కొందరికి నిర్ధారణ కావడంతో మరో సారి విశ్వ జనులు ఉలిక్కిపడ్డారు. తక్కువ ప్రభావం కలిగిన జెఎన్ . 1 సబ్‌వేరియంట్‌ను ఐక్యరాజ్యసమితి “వేరియంట్ ఆఫ్ ఇంటరెస్ట్”గా వర్గీకరించింది. భారత దేశంలోనే కేరళ రాష్ట్రంలో తొలి జెఎన్ . 1 వైరస్ 79–ఏండ్ల వృద్ధ మహిళకు బయట పడడం, దినదిన కేసుల సంఖ్య పెరగడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను తగు జాగ్రత్తలు తీసుకోవాలంటూ అప్రమత్తం చేస్తున్నారు.

### శీతాకాలం వైరస్‌ల వ్యాప్తి తీవ్రత ఎక్కువ:

శీతాకాలంలో పలు రకాలైన వైరస్‌ల వ్యాప్తికి అనుకూలమైన వాతావరణమని, చలి గాలులు మందకోడిగా వ్యాపించడం, రక్తనాళాలు ముడుచుకుపోయి రక్త ప్రసరణ వేగం తగ్గడం, అతినీలలోహిత కిరణాల తీవ్రత తక్కువగా ఉండడం లాంటి పలు కారణాలతో వ్యక్తుల్లో రోగనిరోధకశక్తి తగ్గడం గమనిస్తున్నారు. కరోనాతో పాటు ఇతర శ్వాసకోశ సంబంధ వైరస్‌లను అడ్డుకోవడానికి నాణ్యత కలిగిన మాస్కులు వాడితే ఆశించిన ఫలితాలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యాధినిరోధకశక్తి బలహీనంగా ఉన్న వారితో పాటు వయోవృద్ధులు, తీవ్రమైన సహ–అనారోగ్యాల పాలైన (కోమార్బిడ్) ప్రజలు, పోషకాహారం లోపించిన నిరుపేదలు, దీర్ఘకాలిక రోగాలతో బాధ పడుతున్న వారు, కరోనా సోకిన తరువాత వైద్యంతో నయం అయిన వారు తగు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవలసి ఉంటుందని వివరిస్తున్నారు. అన్ని రకాల పండ్లు, కూరగాయలు, తగు నీరు తీసుకొనుట ద్వారా జెఎన్ . 1 నుంచి రక్షణ పొందవచ్చని గుర్తు చేస్తున్నారు.

### కరోనా నిబంధనలు పాటించాలంటున్న ప్రభుత్వాలు:

ఇప్పటికే కర్నాటక ప్రభుత్వం వృద్ధులు, దీర్ఘకాల రోగాలతో బాధ పడుతున్న వారందరూ విధిగా మాస్కులు ధరించాలని నియమం కూడా తీసుకురావడం చూస్తున్నాం. ఇతర రాష్ట్రాలు కూడా జెఎన్ . 1 నుంచి తప్పించుకోవడానికి మాస్కులతో ముక్కులు మూసుకోవడం, భౌతిక దూరాలు పాటించడం, సానిటైజర్లు వాడడం లాంటి నియమాలను పాటించారని ప్రజలకు హెచ్చరికలు చేస్తున్నారు. ఆసుపత్రుల్లో అవసర ఏర్పాట్లు చేయడం, ప్రజలకు తగు సూచనలు చేయడం దేశవ్యాప్తంగా కొనసాగుతున్నది. చిన్న జ్వరం వచ్చినా ప్రజలు మానవ ఆవాసాలకు దూరంగా క్వారంటైన్ అవ్వాలని సూచిస్తున్నారు.

### జెఎన్ .1 సబ్‌వేరియంట్ ప్రభావం, రోగ లక్షణాలు:

జీవ కణంలోని జెనెటిక్ మెటీరియల్ సహాయంతో వైరస్‌లు కొంత మార్పులు పొంది రిప్లికేట్ కావడంతో నూతన వేరియంట్లు/సబ్‌వేరియంట్లు పుట్టుకొస్తాయి. కేరళలో బయట పడిన 21 జెఎన్ . 1 సబ్‌వేరియంట్ కేసులతో పాటు గోవాలో 19 కేసులు, కర్నాటకలో 20 కేసులు, కొన్ని మహారాష్ట్రలో బయట పడ్డాయి. ఇతర రాష్ట్రాల్లో కూడా నిర్ధారణ కావడం గమనించాలి. దేశవ్యాప్తంగా దాదాపు 300 వరకు కేసులు ఇప్పటికే రిపోర్ట్ కావడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండవలసిన అగత్యం ఏర్పడుతున్నది. జెఎన్ . 1 సబ్‌వేరియంట్ సోకిన వ్యక్తుల్లో జ్వరం, దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి, ఒంటి నొప్పులు, అలసట, శ్వాస ఇబ్బందులు, జీర్ణనాళ సమస్యలు, రుచి కోల్పోవడం, జలుబు, తల నొప్పి, డయేరియా/విరోచనాలు, వాంతులు, కండరాల నొప్పులు, వణుకు, రక్త చలన దోషం లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి.

కరోనా వైరస్ మహమ్మారిని తట్టుకోవడానికి తప్పనిసరిగా మాస్కులు వాడడం, సానిటైజర్లతో చేతులు శుభ్రం చేసుకోవడం, భౌతిక దూరాలు పాటించడం, తుమ్ములు/దగ్గులా వచ్చినపుడు ఒంటరిగా దూరం జరగడం, అస్వస్థత అనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవడం, పోషకాహారం తినడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటూ మన ఆరోగ్య దీపాన్ని కరోనా మేఘాలు తాకకుండా చూసుకుందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

-ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్ర పరిధికి తీసుకువెళ్లే బాధ్యత అధికారులది.
- ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలి.
-రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహా.




సంగారెడ్డి, డిసెంబర్ 25 (నేటి నిజం ప్రతినిధి) క్రిస్టమస్ పండగ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ.

ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందించే దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోరారు.

సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజా పాలన కార్యక్రమం జిల్లా స్థాయి సమన్వయ సమావేశం మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన కార్యక్రమాన్ని అందరి సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. నాయకుల తత్వం, గుణం వేరువేరుగా ఉంటుంది కానీ సిస్టం అన్నది ఒకే విధంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం చేసిన వాగ్దానాలు, వాటి ఆచరణ, వాటిని అమలు చేయడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వానికి, పరిపాలనకు అధికార గనం గుండె లాంటిదని, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి అర్హులకు అందజేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదని అన్నారు. ప్రజలకు జవాబుదారీగా సేవలందించే ప్రభుత్వ పరిపాలనకు అనుగుణంగా అధికారుల పనితీరు ఉండాలన్నారు.

ఈనెల 28 నుండి జనవరి 6 వరకు నిర్వహించనున్న ప్రజా పాలన కార్యక్రమంలో అధికారులు ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

గ్రామసభలలో దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసి సమన్వయంతో పనిచేసినప్పుడే ఏ పథకమైన విజయవంతం అవుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు అవుతాయన్నారు.

జిల్లా యంత్రాంగం అందరూ టీం స్పిరిట్ తో కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసే దిశగా ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు.

అధికారులు నిబద్ధతతో పనిచేయాలని, స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రసీదు ఇవ్వాలని సూచించారు. చేసే ప్రతి పని పారదర్శకంగా, బాధ్యతయుతంగా ఉండాలని, అధికారులు వత్తిడి లేకుండా నిబంధనలకు లోబడి పని చేయాలని సూచించారు.

అంతకుముందు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ప్రజా పాలన కార్యక్రమ నిర్వహణ కు సంబంధించి తీసుకుంటున్న చర్యలు, ఏర్పాట్లపై మంత్రికి వివరించారు.

కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఆయా శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు...

హైదరాబాద్, డిసెంబర్ 25: సంక్రాంతి పండుగ దృష్ట్యా రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను నడపనుంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ తెలిపారు. హైదరాబాద్–తిరుపతి(07489/07490) స్పెషల్ ట్రైన్ ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.50 గంటలకు తిరుపతి చేరుకోనుంది.

తిరుగు ప్రయాణంలో 30వ తేదీ రాత్రి 8.25కు బయలుదేరి ఉదయం 8.50కి హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్–తిరుపతి (07449/07450) మరో స్పెషల్ ట్రైన్ ఈ నెల 27వ తేదీ సా. 6.10కు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.45కు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 28వ తేదీ సాయంత్రం 5.15కు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.30కు హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్–కాకినాడ (07451/07452) స్పెషల్ ట్రైన్ ఈ నెల 29న రాత్రి 8.30కు బయలుదేరి మరుసటిరోజు ఉ. 8 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 30వ తేదీ రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉ.9కి హైదరాబాద్ చేరుకుంటుంది.

# బాలల అనాథ శరణాలయంలో పవన్ కల్యాణ్ సతీమణి అనా క్రిస్మస్ వేడుకలు



హైదరాబాద్,డిసెంబర్ 25:జనసేన పార్టీ అధినేత, టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అర్ధాంగి అనా కొణిదెల అనాథ బాలల నడుమ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. హైదరాబాద్ బాలాజీ స్వర్ణపురి కాలనీలో ఉన్న జీవోదయ హోమ్ ఫర్ చిల్డ్రన్ అనాథ శరణాలయానికి వెళ్లారు. అక్కడి చిన్నారులతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. అనాథ బాలలతో ముచ్చటించి వారి విద్యాబుద్ధుల గురించి తెలుసుకున్నారు. అనాథాశ్రమం నిర్వాహకులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ అర్ధాంగిని జీవోదయ చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు సత్కరించారు.

# చంద్రబాబు సమక్షంలో పలువురు వైసిపి నేతలు టిడిపిలో చేరిక




అమరావతి, డిసెంబర్ 25:రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే ఆలోచన ఉన్నవారే టీడీపీలోకి వస్తున్నారని తెలిపారు టీడీపీ అధినేత చంద్రబాబు. ఓటమి ఖాయమని జగన్ కు అర్థమైందని వ్యాఖ్యానించారు. తణుకు, పెదకూరపాడు, గజపతినగరం, అమలాపురం నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు ఇవాళ భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ అధినేత చంద్రబాబు పసుపు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ, ఇన్ని అరాచకాలు చేసిన వ్యక్తి సీఎంగా పనికిరారని అన్నారు. తాను 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశానని, 28 ఏళ్లుగా పార్టీ అధ్యక్షుడిగా ఉన్నానని, అందరి ఆశీస్సులతో రాష్ట్రానికి, తెలుగుజాతికి మంచి పేరు, గౌరవం తీసుకువచ్చానే తప్ప, ఎప్పుడూ అపఖ్యాతి తీసుకురాలేదని అన్నారు.

ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అరాచకాలమయం చేశారని మండిపడ్డారు. ఇలాంటివి చూస్తుంటే మనసు కలచివేస్తుందని, ఒక్కోసారి రాష్ట్రం పరిస్థితి తలచుకుంటే రాత్రి నిద్ర కూడా రాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క చాన్స్ ఇస్తే? నాలుగు సంవత్సరాల 9 నెలల పాటు బాధపడాల్సి వచ్చిందని చంద్రబాబు వివరించారు. చివరికి దేవుడే దిక్కు అనే పరిస్థితికి వచ్చారని వ్యాఖ్యానించారు. కానీ, మన రాతను తిరగరాసే శక్తి మన చేతుల్లోనే ఉందని చంద్రబాబు ఉద్ఘాటించారు.

# ఒకే కుటుంబాన్ని వెంటాడిన మృత్యుపాశం..రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం

నల్లగొండ, డిసెంబర్ 25జిల్లాలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతిచెందారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో నిడమనూరు మండలంలో వెంపాడు స్టేజి వద్ద నడుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఓ బైకు ఢీకొట్టింది. దీంతో బైకర్ కేశవులుతో పాటు పాదచారి సైదులు మృతిచెందారు. కేశవులు మరణవార్త తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు పెద్దవూర మండలం మల్లెవాని కుంట తండా నుంచి ఆటోలో నేటి తెల్లవారు ఝూమున ప్రమాద స్థలికి బయల్దేరారు. ఈ క్రమంలో పార్వతీపురం వద్ద వారి ఆటోను ట్యాంకర్ ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్నలుగురు మృత్యువాతపడ్డారు.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారని తెలిపారు. గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. మృతులను గుణ్య, నాగరాజు, పాండ్య, బుజ్జిగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు చనిపోవడంతో మల్లెవానికుంటలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

# మంచు దుప్పట్లో తెలంగాణ.. రోజురోజుకి పెరుగుతున్న న్యూమోనియా కేసులు

హైదరాబాద్, డిసెంబర్ 25: రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుండడంతో చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా న్యూమోనియా బారిన పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతుండడంతో పాటు పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. దీంతో న్యూమోనియా బారిన పడుతున్నవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. న్యూమోనియా ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి కావడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

మరీ ముఖ్యంగా తీవ్రమైన చలి కారణంగా చిన్నారులు న్యూమోనియా బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. చలి కారణంగా న్యూమోనియాతో పలు రకాల వైరస్‌లు పిల్లలపై ప్రభావం చూపితే శ్వాస వ్యవస్థలో ఇబ్బందులు ఏర్పడుతాయని, సరైన సమయంలో మందులను వాడకపోతే క్రమేణా నీరు ఊపిరితిత్తుల్లోకి చేరుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన చలికారణంగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో న్యూమోనియాతో బాధపడుతున్న పిల్లల కేసుల సంఖ్య హైదరాబాద్‌లోని నీలోఫర్‌తోపాటు ఎంజీఎం, వివిధ జిల్లాల ఆసుపత్రుల్లో పెరుగుతోంది.

నీలోఫర్ ఆసుపత్రిలో ఇప్పటికే దాదాపు 100మంది దాకా చిన్నారులు న్యూమోనియాతో చేరినట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. చిన్నారుల్లో అనేక మంది జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులతో ఆసుపత్రికి వస్తున్నారని, వారం గడిచినా జ్వరం తగ్గకపోవడంతో న్యూమోనియాగా నిర్ధారించి చికిత్స అందిస్తున్నామని వైద్యులు చెబుతున్నారు. న్యూమోనియా బాధితుల్లో అయిదేళ్ల లోపు చిన్నారులు ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆహార పోషణ సరిగా లేక, వాతావరణ పరిస్థితులు అనుకూలించక, రోగ నిరోధకశక్తి సన్నగిల్లడంతో ఈ జబ్బు బారిన పడుతున్నారని చెబుతున్నారు. తల్లిపాలు ఆరు నెలల పాటు తీసుకుంటే న్యూమోనియా వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని తెలిపారు. తక్కువ బరువుతో పుట్టే పిల్లలకు న్యూమోనియా వచ్చే అవకాశాలు ఎక్కువ అని చెబుతున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, గర్భిణులు ఈ వ్యాధి బారిన తరచూ పడే పడే అవకాశం ఉంది.

న్యూమోనియా సోకిన చిన్నారుల్లో విడవని పొడి దగ్గు, తీవ్రమైన జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కఫం, రక్తం పడడం, చాతీనొప్పి, ఆహారం తీసుకోవడానికి ఇష్టం ఉండకపోవడం, మైకం వంటి లక్షణాలు కనిపిస్తాయని, విడవని దగ్గు, జలుబుతోపాటు జ్వరం, శ్వాసకోశ సమస్యలు పెరిగితే వెంటనే వైద్యుడికి చూపించి మందులు వాడాలని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నారులకు బలవర్ధకమైన ఆహారం పిల్లలకు ఇవ్వాలని, ఫ్రిజ్‌లో పెట్టిన ఆహారం తినిపించొద్దని సూచిస్తున్నారు. చలి నుంచి శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులను చిన్నారులకు వేయాలంటున్నారు.

పంజా విసురుతున్న చలి?సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు..

ప్రస్తుతం రాష్ట్రంలో చలి డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఈశాన్యం నుంచి గాలులు వీస్తుండడంతో పది రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. కొమరంభీమ్ ఆసీఫాబాద్, సిర్పూరు తదితర ప్రాంతాల్లో అత్యల్పంగా6 నుంచి 8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. రాబోయే 2–3రోజుల పాటు చలి తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.

చలికితోడు పొగమంచు పలు జిల్లాల్లో కురుస్తోంది. ఉదయం 9 గంటలు దాటినా పొగమంచు వీడడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాందేడ్–అఖోల జాతీయ రహదారి 161ని పొగమంచు పూర్తిగా కమ్మేస్తోంది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని నెమ్మదిగా ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

# మాజీ సైనికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మాజీ సైనికుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి



హైదరాబాద్ డిసెంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సైనికుల కుటుంబాలను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మాజీ సైనికుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. ఆదివారం అల్వాల్లోని వేంకటేశ్వర పార్కులో సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగయ్యగౌడ్ అధ్యక్షతన సైనికుల కుటుంబాల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా రంగయ్యగౌడ్ మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా మాజీ సైనికుల కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వాలు హామీ ఇస్తున్నాయి తప్ప పని మాత్రం ఎక్కడ వేసియా గొంగడి అక్కడ వేసిన మాదిరిగా ఉందని ఆవేదన వ్యక్తం చేసారు. జవ హర్నగర్ కార్పొరేషన్ పరిధిలో తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలను ఆయా ప్రభుత్వాలు స్వాధీనం చేయలేకపోయాయని వాపోయారు.గతంలో మల్కాజిగిరి ఎంపిగా సైనికుల కుటుంబాలపై అవగాహన ఉన్న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి వెంటనే తమ సమస్యలు పరిష్క రించాలని కోరారు.ఈ సమావేశం లో మాజీ సైనికులు,వీరమరణం పొందిన వారి బార్యలు, కుటుంబ సబ్యులు పాల్గొన్నారు.

# ఇది ఎనిమిదో వింతే..లోకేష్‌కు షర్మిల క్రిస్మస్ గిఫ్ట్...

అమరావతి, డిసెంబర్ 25:తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అత్యంత ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. పైగా ఇది ఎవరూ ఊహించని విషయం కూడా. , వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కు క్రిస్మస్ కానుకలు పంపారు. “వైఎస్సార్ కుటుంబం మీకు శుభాకాంక్షలు తెలుపుతోంది? ఈ క్రిస్మస్ ఆనందమయంగా సాగిపోవాలి.. మీకు 2024లో అంతా శుభం కలగాలి” అంటూ షర్మిల సందేశం పంపారు.

షర్మిల కానుకలు పంపిన విషయాన్ని నారా లోకేశ్ స్వయంగా వెల్లడించారు. అంతేకాదు, ఆమె పంపిన కానుకల పట్ల హర్షాన్ని వెలిబుచ్చారు. “ప్రియమైన షర్మిల గారూ మీరు పంపిన అద్భుతమైన క్రిస్మస్ కానుకలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. మీకు, మీ కుటుంబానికి ఈ క్రిస్మస్ తో పాటు, నూతన సంవత్సరాది కూడా సంతోషకరంగా సాగిపోవాలని నారా కుటుంబం శుభాకాంక్షలు తెలుపుతోంది” అంటూ లోకేశ్ బదులిచ్చారు.

ప్రభువైన ఏసు క్రీస్తు ఆచరించిన ప్రేమ, కరుణ,సహనం ప్రతీ ఒక్కరిలో పెంపొందాలి. కరుణామయుడైన క్రీస్తు మనకు అందించిన శాంతి సందేశం సమాజానికి పంచి ప్రపంచశాంతికి దోహదపడాలి. క్రీస్తు చూపిన మార్గమైన దయ, త్యాగగుణం ప్రతీ ఒక్కరూ అలవర్చుకున్నప్పుడే జీవితం సంతోషమయం అవుతుంది. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులందరికీ శుభాకాంక్షలు. దయామయుడు లోకానికి వచ్చిన పర్వదినమైన క్రిస్మస్ పండగని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

# జమ్మూ కాశ్మీర్ యువత ఏ రంగంలోనైనా రాణించే సత్తా ఉంది: ప్రధాని

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు తెల్లవారుజామున 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో జమ్మూ ఉ కాశ్మీర్ విద్యార్థుల ప్రతినిధి బృందంతో సంభాషించారు. జమ్మూ ఉ కాశ్మీర్‌లోని అన్ని జిల్లాల నుండి వచ్చిన సుమారు 250 మంది విద్యార్థులు ఫ్రీవీలింగ్ మరియు అనధికారిక పరస్పర చర్యలో పాల్గొన్నారు.ఈ విద్యార్థులు భారత ప్రభుత్వ 'వతన్ కో జానో – యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ 2023' కింద జైపూర్, అజ్మీర్ మరియు న్యూఢిల్లీలను సందర్శిస్తున్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తితో, జమ్మూ కాశ్మీర్ యువతకు దేశంలోని సాంస్కృతిక మరియు సామాజిక వైవిధ్యాన్ని ప్రదర్శించడం ఈ పర్యటన లక్ష్యం.ఇంటరాక్షన్ సందర్భంగా, ప్రధాన మంత్రి విద్యార్థులను వారి ప్రయాణ అనుభవం మరియు వారు సందర్శించిన ఐకానిక్ ప్రదేశాల గురించి అడిగి తెలుసుకున్నారు. జమ్మూ మరియు కాశ్మీర్‌లోని గొప్ప క్రీడా సంస్కృతి గురించి ప్రధాన మంత్రి చర్చించారు మరియు క్రికెట్, ఫుట్‌బాల్ మొదలైన క్రీడలలో వారి భాగస్వామ్యాన్ని గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆసియాలో మూడు పతకాలు సాధించిన జమ్మూ మరియు కాశ్మీర్‌కు చెందిన యువ ఆర్చర్ శీతల్ దేవిని ప్రధాన మంత్రి ఉదాహరణగా ఇచ్చారు. హాంగ్‌జౌలో పారా గేమ్స్. జమ్మూ కాశ్మీర్ యువత ప్రతిభను కూడా ప్రశంసించిన ప్రధాన మంత్రి, వారు ఏ రంగంలోనైనా రాణించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నారని అన్నారు.దేశాభివృద్ధికి పాటుపడాలని మరియు విక్షిత్ భారత్ ఏ2047 కలను సాకారం చేయడంలో సహాయపడాలని విద్యార్థులకు ప్రధాన మంత్రి సూచించారు.జమ్మూ కాశ్మీర్ లో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన నిర్మాణం గురించి మాట్లాడిన ప్రధాని, ఈ ప్రాంతంలో కనెక్టివిటీని మెరుగుపరుస్తామని చెప్పారు.చంద్రయాన్–3 మరియు ఆదిత్య–ఎల్1 మిషన్ యొక్క విజయం గురించి ప్రధాన మంత్రి చర్చించారు, ఈ శాస్త్రీయ విజయాలు ప్రతి భారతీయుడు గర్వపడేలా చేశాయని అన్నారు.

ఈ సంవత్సరం జమ్మూ కాశ్మీర్‌ను సందర్శించిన రికార్డు సంఖ్యలో పర్యాటకుల గురించి ప్రస్తావిస్తూ, జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటక రంగంలో అపారమైన అవకాశాలున్నాయని ప్రధాని అన్నారు. ప్రధాన మంత్రి యోగా యొక్క ప్రయోజనాల గురించి కూడా ప్రస్తావిస్తూ విద్యార్థులను రోజూ ఆచరించాలని సూచించారు.

# సింగరేణి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

## – పోరాటాలు చేశామని చెప్పుకొనే కార్మిక సంఘాలు ఇంకా ఉండవు



భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 25 (నేటినిజం ప్రతినిధి) :సింగరేణి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఇల్లందులో మంత్రి పొంగులేటి కామెంట్స్... సింగరేణి వ్యాప్తంగా.. .ఒక్కచోట మినహా అన్నిచోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయం సాధించారు.. .కార్మికుల గుండెల్లో కాంగ్రెస్ ఉంది. సింగరేణి ఎన్నికల్లోను ఐఎన్టియూసి ని గెలిపించాలి. 2017 నుండి సింగరేణి కార్మికుల సమస్యల పట్ల నాకు అవగాహన ఉన్నది...గతంలోనే జరగాల్సిన ఎన్నికలను గత ప్రభుత్వం ఓటమి భయంతో ఎన్నికలు జరపలేదు...గత ప్రభుత్వం అవకతవకలతో కార్మికులను పట్టించుకోలేదు...గత ప్రభుత్వం మాటలు మీతో పాటు నేను కూడా నమ్మి మోస పోయాను. నేడు వచ్చిన ప్రభుత్వంలో నేను కీలక మంత్రి పదవిలో ఉన్నాను...మీ సమస్యల పరిష్కారానికి సీఎం పక్కన కూర్చోనైనా సంతకం పెట్టిస్తాను. గత ఐదు సంవత్సరాలలో సింగరేణి గనులు కనుమరుగై కార్మికుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. మా మేనిఫెస్టోలో పెట్టిన రెండు లక్షల ఉద్యోగాల కల్పనలో సింగరేణి ఉద్యోగాలు కూడా భర్తీ చేస్తాం.

ఇల్లందులో జేకే ఓసి విస్తరణలో ఇక్కడ కార్మికులు బదిలీ కాకుండా...ఇంకొక మైనింగ్ ఫిట్3 తో కార్మికులు ఇక్కడే విధుల్లో ఉండేలా చూస్తాం. కార్మికుల సొంతింటి కల కోసం వడ్డీ లేని రుణాలు ఇప్పిస్తామని కృషిచేసిన గత ప్రభుత్వం సహకరించలేదు.

కార్మికులకు వైద్యం కోసం మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేస్తాం. కార్మికుల న్యాయమైన డిమాండ్లు ఈ ప్రభుత్వ హయాంలో పరిష్కరిస్తాం. పోరాటాలు చేశాం ...అని చెప్పుకొనే కార్మిక సంఘాలు ఇంకా ఉండవు...20 సంలు ప్రభుత్వంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే. కారుణ్య నియామకాలు కోసం కార్మికులు లక్షలు ఇచ్చే పరిస్థితి ఉండేది...ఇకనుంచి ఒక్క రుపాయి ఖర్చు పెట్ట కుండ కారుణ్య నియామకాలు చేస్తాం.

# షీటీమ్స్ తో మహిళలకు, బాలికలకు భద్రత, భరోసా

## –జిల్లాలోని హాట్స్పాట్ వద్ద నిరంతరం నిఘా

## –జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): సంవత్సరంలో జిల్లాలో మహిళలను వేధిస్తున్న వారిపై 26 కేసులు నమోదు,మహిళలను ఈవ్ టీజింగ్ చేస్తున్న వారిపై 15 ఈ పెట్టి కేసులు నమోదు, షీటీమ్స్ బృందాలు హాట్స్పాట్ 574 సార్లు సందర్శించడం జరిగింది. షీ టీమ్స్ పాఠశాలల్లో, కాలేజీలలో,మహిళలు పని చేసే ప్రదేశాల్లో 279 అవగాహన సదస్సులు కల్పించడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న షీ టీమ్స్ బృందాలు కళాశాలలో, పాఠశాలల్లో, తెలంగాణ మోడల్ స్కూళ్లలో, రెసిడెన్షియల్ స్కూల్ లలో కేజీబీవీ స్కూళ్లలో,మహిళలు పని చేస్తున్న ప్రదేశాల్లో,బస్టాండ్ ప్రాంతల్లో మహిళలకు, విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యుమెన్ ట్రాఫికింగ్ లపై 279 అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు బాలికల రక్షణ గురించి రాష్ట్రంలో ప్రత్యేకంగా షీటీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మహిళల, బాలబాలికల, విద్యార్థిని, విద్యార్థులకు, రక్షణగా నిలుస్తూ సేవలు అందించడం జరుగుతుందన్నారు. గుర్తించిన హాట్స్పాట్ వద్ద మరింత నిఘా ఉంచడం జరుగుతుందని, రాష్ట్రంలో షీ టీమ్స్ ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. మహిళలు బాలికలు విద్యార్థినిలు షీటీమ్స్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు. షీటీమ్ కంప్లైంట్ క్యూఆర్ కోడ్ గురించి తెలియజేస్తూ ఆన్లైన్ ద్వారా ఎక్కడి నుండి అయిన పిర్యాదు చేసేందుకు ఉపయోగపడే ఈ షీటీమ్ కంప్లైంట్ క్యూఆర్ కోడ్ స్కానింగ్ పోస్టర్స్ ను జిల్లాలో ఆర్టీసీ బస్ లలో, బస్ స్టాండ్ లలో, సినిమా హల్ లు, స్కూల్స్, కళాశాలలు,ఇతర ముఖ్యమైన ప్రాంతాలలో అతికించబడి ఉంటాయని తెలిపారు. జిల్లాలో ఎవరైనా బాధిత మహిళలు షీ టీమ్ కు పిర్యాదు చేయదలుచుకున్నప్పుడు ముందుగానే తమ మొబైల్ నందు క్యూఆర్ కోడ్ స్కానర్ ను కలిగి ఉండాలని, తమ ఫోన్ తో పోస్టర్ పై ఉన్న క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా క్యూఆర్. టీఎస్. పోలీస్. గావ్. ఇన్ అనే లింక్ వస్తుందని, దీనిని క్లిక్ చేయగానే పిర్యాదు ఫోరం ఓపెన్ అవుతుందన్నారు. అందులోని పేరు, లోకేషన్ తదితర వివరాలను పూరించి సబ్ మిట్ చేయగానే జిల్లా పోలీస్ కార్యాలయంలో షీటీమ్ సాఫ్ట్వేర్ ఐటీ విభాగానికి చేరుతుందని, అక్కడ నిరంతరం పర్యవేక్షించే ఐటీ సిబ్బంది ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఆలొకేషన్ కు దగ్గరలో ఉన్న పోలీస్ అధికారులకు ఫార్వర్డ్ చేయడం ద్వారా సంబంధిత అధికారులు లొకేషన్ కు చేరుకొని తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వేధింపులకు గురయ్యే మహిళలు షీటీమ్ ను వినియోగించుకోవాలని, మహిళల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అంతే కాకుండా మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 లేదా షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712656425 కి పిర్యాదు చేసినచో, వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపారు. విద్యార్థినిలకు, మహిళలకు, కళాశాల విద్య చాలా ముఖ్యమైనదని ఎవరు కూడా మీ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకుండా మంచిగా చదువుకోవాలని ప్రతి ఒక్కరి రక్షణ గురించి షీటీమ్స్ పని చేయడం జరుగుతుందని, మీకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే వాట్సప్ నెంబర్ కు ఫోన్ చేసి తెలపాలని ఎస్పీ కోరారు.

# రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి

నల్లగొండ డిసెంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నల్లగొండ జిల్లాలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతిచెందారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో నిడమనూరు మండలంలో వెంపాడు స్టేజి వద్ద నడుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఓ బైకు ఢీ కొట్టింది. దీంతో బైకర్ కేశవులుతోపాటు పాదచారి సైదులు మృతిచెందారు. కేశవులు మరణవార్త తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు పెద్దవూర మండలం మల్లెవాని కుంట తండా నుంచి ఆటోలో ప్రమాద స్థలికి బయల్దేరారు. ఈ క్రమంలో పార్వతీపురం వద్ద వారి ఆటోను ట్యాంకర్ ఢీకొట్టింది.దీంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారని తెలిపారు. గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. మృతులను గున్యా, నాగరాజు, పాండ్య, బుజ్జిగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు చనిపోవడంతో మల్లెవానికుంటలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

# చార్మినార్ బాలాజీ ఆలయంలో మాజీ మంత్రి తలసాని పూజలు



హైదరాబాద్, డిసెంబర్ 25:వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం చార్మినార్ ఈస్ట్లోని చౌక్ మైదాన్లోని బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట ఆలయ ట్రస్టీలు రాజేందర్ పిట్టి, శ్రీనివాస్ బన్సాల్, రామ్ నివాస్ బన్సాల్, పియూష్ గుప్తా, మహావీర్ జైన్, రమణాచారి మహారాజ్, ఆత్రీయ స్వామి మహరాజ్ తదితరులు ఉన్నారు. అలాగే మాజీ మంత్రి భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. మ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ట్రస్టీ శశికళ తీర్థ ప్రసాదాలు అందజేసి, సత్కరించారు.

# క్రిస్మస్ వేడుకల్లో మంత్రులు పొంగులేటి, తుమ్మల



ఖమ్మం, డిసెంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): నగరంలోని చర్చికాంపౌండ్ లోని సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తెలంగాణ వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాదర్, బిషప్ లు ఈ సందర్భంగా ఇద్దరి మంత్రులకు ఆశీర్వచనలను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... ముందుగా క్రైస్తవ సోదరులకు ప్రత్యేకంగా క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. యేసు క్రీస్తు చల్లని చూపు తెలంగాణ ప్రజలు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల మీద ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.

# ఆరు పథకాలు అమలులో అన్ని పార్టీలను భాగస్వాములను చేయండి- ప్రభుత్వానికి బండి సూచన

కరీంనగర్, డిసెంబర్ 25: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రధానమైన 6 హామీలను అమలు చేసేందుకు దరఖాస్తులను స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించడాన్ని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ స్వాగతించారు. అయితే తెల్ల రేషన్ కార్డే అందుకు ప్రధాన అర్హతగా పేర్కొనడం పట్ల సందేహం వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి జయంతిని పురస్కరించుకుని జిల్లా పార్టీ కార్యాలయంలో "సుపరిపాలన దినోత్సవం" నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్ పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వాజ్ పేయి దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ, "రాష్ట్రంలో గత పదేళ్లుగా ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. ఇప్పటికే 10 లక్షల కుటుంబాలు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఇంకా లక్షలాది కుటుంబాలు కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు వేచి చూస్తున్నారు. వాళ్లందరికీ ఏ విధంగా న్యాయం చేస్తారు"అని ప్రశ్నించారు. తక్షణమే కొత్త రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానించాలని కోరారు. దీంతోపాటు రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్దిదారులను గుర్తించి 6 పథకాలను అమలు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు.

# దళిత ప్రధాని కార్డు ప్రయోగం ఫలించేనా!?

న్యూ డిల్లీ డిసెంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గత దాది కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఎం.మల్లికార్జున్ ఖర్గే ఎన్నికయ్యారు. 24 ఏండ్ల తర్వాత నెహ్రూ-గాంధీ కుటుంబానికి సంబంధం లేని బయటి వ్యక్తికి ఈ పదవి లభించిందని కొందరు సంబురపడ్డారు. బాబూ జగ్జీవన్రామ్ తర్వాత 52 ఏండ్లకు మరోసారి దళిత వ్యక్తిని అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టిన కాంగ్రెస్ తాజాగా ప్రధాని అభ్యర్థిగా ఖర్గే పేరును జపిస్తున్నది. ఎన్నికల వేళ 'దళిత ప్రధాని' కార్డును కాంగ్రెస్ తెరపైకి తీసుకురావడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 1998 నుంచి 2022 వరకు సోనియా గాంధీ, ఆమె కుమారుడు రాహుల్గాంధీ కాంగ్రెస్ అధినేతలుగా ఉన్నా రు. కానీ వరుస వైఫల్యాలతో అనూహ్యంగా ఖర్గేను కాంగ్రె స్ పార్టీ జాతీయ అధ్యక్షుడిని చేసింది. తాజాగా ఆ పార్టీ దళిత ప్రధాని కార్డును ప్రయోగిస్తున్నట్టు తెలుస్తున్నది.సోనియా, రాహుల్గాంధీ నాయకత్వంలో వరుసగా రెండు పార్లమెంటు ఎన్నికల్లో (2014, 2019) కాంగ్రెస్ ఘోర పరాజయాలను చవిచూసింది. లోక్సభలో ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు పొందాలంటే కనీసం 55 స్థానాలు అవసరం. ఈ రెండుసార్లూ కాంగ్రెస్ కేవలం 44, 52 సీట్లతో సరిపెట్టుకున్నది. గత పదేండ్లుగా భారత పార్లమెంటు దిగువ సభలో కాంగ్రెస్కు ప్రతిపక్ష హోదా దక్కకపోవడం ఆ పార్టీ కేంద్ర నాయకత్వ సామర్థ్యానికి నిదర్శనం. దేశ చరిత్రలో కాంగ్రెస్ పదేండ్లు అధికారంలో లేకపోవడం ఇదే మొదటిసారి.

# క్రిస్మస్ వేడుకల్లో దయాకర్ రెడ్డి



ఖమ్మం, డిసెంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా చర్చి లలో జరిగిన వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా పల్లెగూడెం లోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాదర్ ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి ని ప్రత్యేకంగా ఆశీర్వదించారు.

# కరాటే పోటీల్లో సత్తా చాటిన వేములవాడ విద్యార్థులు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): డిసెంబర్ 25: జగిత్యాల జిల్లా కేంద్రంలోని విరుపాక్షి గార్డెన్లో తెలంగాణ స్థాయి ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ 2023 ( ఓకినవా మార్షల్ ఆర్ట్స్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 24 తేదీల్లో తెలంగాణ స్థాయికరాటే పోటీలు నిర్వహించారు. ఈ కరాటే పోటిల్లో కటాన్, కుమ్మితే విభాగాల్లో వేములవాడ పట్టణానికి చెందిన ఓకినవా స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు సిహెచ్ సూర్య జై చందర్, బంగారు, సాయి మనీ హర్షిత్ , ఎండి అప్సర్, ఎస్. ఆర్య నందన్ బంగారు, ఈ జస్వంత్, సిహెచ్ జశ్విత్ , ఉప్పుల పవన్ రాజ్, ఉదయ్, సిహెచ్ సూర్య సుశీల్, వెండి, ఎండి షాహిద్, ఎస్ కే. షరీన్, తనహాజ్, ఎస్ వర్షిత్, సాయి మణిదీప్, పి అనన్య కాంస్య పతకాలను రాష్ట్ర స్థాయిలో అందుకున్నారు. ఓకినవా స్పోర్ట్స్ కరాటే స్కూల్ టీం మేనేజర్ గా ఏ తిరుపతి కనికరపు రాజశేఖర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండ దేవయ్య, రాష్ట్ర కరాటే అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ మన్నాన్ అభినందించారు..

# మాల మహానాడు ఆధ్వర్యంలో మనస్మృతి దహనం



ఖమ్మం, డిసెంబర్ 25:(నేటనిజం ప్రతినిధి): 1927 డిసెంబర్ 25న మనస్మృతిని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తగలబెట్టిన రోజు సరిగ్గా 96 సంవత్సరాల క్రితం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అంటరాని తనము యొక్క మతపరమైన ప్రాతిపదికన తిరస్కరణకు గుర్తుగా మనస్మృతిని తగలబెట్టినారు, మహద్ సత్యాగ్రహం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మహద్ సత్యాగ్రహం అనేది అంటరాని వారి ప్రజానీతిని పొందే హక్కును, మానవత్వం గౌరవాన్ని స్వీకరించడానికి జరిగిన పోరాటం స్త్రీ హక్కులు, విముక్తి కోసం మనస్మృతిని బహిరంగంగా తగలబెట్టడం ఒక రాజకీయ చర్య ఎందుకు అంటే ఈ పుస్తకం కేవలం మహిళల పట్ల కాకుండా అంటరాని వారి పట్ల అశేష పేద ప్రజల పట్ల అమానవీయ మైన ప్రవర్తనలను బోధించే నియమాలను కలిగిన ఈ మనస్మృతిని తగలబెట్టడం జరిగింది. ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం ఖమ్మం జిల్లాలో అంబేద్కర్ సెంటర్లో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ నాయకులు గుంతేటి వీరభద్రం, ముప్పవరపు మంగయ్య, ఆర్టీసీ జాన్, పుల్లయ్య, గాదర బాబురావు, తెలంగాణ శ్రీనివాస్, నాగటి గోపాల్, తెలగమల్ల శ్రీను, మిన్ను, కొప్పుల రామారావు, ఎర్ర గంగాధర్, యోనా, కరాటే వేణు, చింతమల్ల వెంకటేశ్వర్లు, రోడ్డ శివయ్య, బి. కోటేశ్వర రావు, తదితర మాల సోదరులున్నారు.

# శాంతి, సహనానికి ప్రతీక క్రిస్మస్ : ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి




సూర్యపేట, డిసెంబర్ 25: శాంతి, సహనానికి క్రిస్మస్ ప్రతీక అని.. ఏసుక్రీస్తు మహోన్నత క్షమా గుణసంపన్నుడని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడి అన్నారు. తన దేహానికి శీలలు కొడుతున్న వారిని కుడా క్షమించండి అంటూ వేడుకున్న దయార్ద్ర హృదయుడని.. అటువంటి మహనీయుల బోధనలు ఆచరనీయమని ఆయన పేర్కొన్నారు. సోమవారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు చర్చీలలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్త మానవాళి పట్ల ప్రేమ, నిస్సాహాయిల పట్ల జాలి, అవధులు లేని త్యాగం, సడలని ఓర్పు, శత్రువుల పట్ల కుడా క్షమాగుణం కలిగి ఉన్న కరుణామయుడు ఏసుక్రీస్తు అని ప్రశంసించారు. ఆయన బోధనలు, శాంతి సామరస్యాలను ఇనుమడింప చేస్తాయన్నారు.

సర్వమతలా సమ్మేళనానికి తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ఈ వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ బంగారు నంది అవార్డు అందుకున్న రోమాల ప్రవీణ్




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): స్ఫూర్తి సంస్థ చైర్మన్ రోమాల ప్రవీణ్ కు నేషనల్ బంగారు నంది అవార్డు వరించింది. ఈ సందర్భంగా రోమాల ప్రవీణ్ స్ఫూర్తి సంస్థ స్థాపించి 12 సంవత్సరాలుగా ఎన్నో కార్యక్రమాలు చేస్తూ 50 సార్ల బ్లడ్ డొనేట్ చేయడం జరిగింది.

అలాగే సంస్థ ద్వారా 1500 మందికి బ్లడ్ రక్తదానం చేయించడం జరిగింది.

విద్యార్థులకు టై బెల్టు ఐడెంటి కార్డులు, తదితర సేవలను గుర్తించిన హైదరాబాద్ వల్లూరి ఫౌండేషన్ వారు రోమాల ప్రవీణ్ కు జాతీయ బంగారు నంది అవార్డు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ వకులభరణం కృష్ణ మోహన్ రావు, మాజీ మంత్రివర్యులు గుడిసెల రాజేశం గౌడ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి, రిటైర్డ్ జడ్జి మధుసూదన్, సినీ ప్రముఖులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

## కొత్త శీర్షిక ప్రారంభం

## నాకు నచ్చిన కథ

నేటి నిజం దిన పత్రిక సాహితీ కెరటాలులో త్వరలో కొత్త శీర్షిక ప్రారంభిస్తున్నాం.

"నాకు నచ్చిన కథ" శీర్షికలో మంచి కథలనుపాఠకులకు అందించాలనేది లక్ష్యం.

ఈ శీర్షికలో ప్రచురించడానికి ఎవరైనా కథలను సూచించవచ్చు.

అవి పుస్తకాల్లో వచ్చినవైనా పత్రికల్లో వచ్చినవైనా మీకు గుర్తుండి పోయిన కథలు ఈ శీర్శికకు పంపవచ్చు.

ఆ కథ ఎందుకు నచ్చిందో ఆ కథ విశిష్టత ఏమిటో ఒక పేజీ విశ్లేషణ ఆ కథతో పాటు పంపండి

మీకు నచ్చిన కథను డిటిపి చేసి ఒపెన్ ఫైలు, పిడిఎఫ్ పంపి సహకరించడం మీ వంతు. ఎంపిక చేసి ప్రచురించడం మా వంతు. సుప్రసిద్ధ సీనియర్ రచయిత **బి.ఎస్.రాములు** గారు ఈ శీర్షికను నిర్వహిస్తారని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

– సంపాదకులు

'నేటినిజం' దినపత్రిక, మాతృశ్రీ నిలయం
ఎస్.ఆర్.టి. 169, జవహర్నగర్, హైదరాబాద్-500 020
email: netinizam2020@gmail.com

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com